# రాష్ట్ర ఆర్థిక ప్రగతి బీఆర్ఎస్ చలవే!

- లక్షన్నర కోట్లు పెరిగిన జీఎస్డీపీ విలువ
- రూ.33వేలకుపైగా పెరిగిన తలసరి ఆదాయం
- కేసీఆర్ ప్రభుత్వ సంస్కరణల ఫలితం
- బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించిన భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): 'మీ ఆనవాళ్లన్నీ చెరిపేసే జిమ్మెదారి మాది' అని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని గంభీర ప్రకటనలు చేసినా.. 'గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని మాటలు అన్నా.. చివరికి కేసీఆర్ సర్కార్ చేసిన మంచిని ఒప్పుకోక తప్పలేదు. బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం అనే కసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో జరిగిన సంస్కరణ, అభివృద్ధి ఫలాలను వివరించారు. రాష్ట్ర జీఎస్డీపీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.13.02 లక్షల కోట్లుగా ఉండగా, 2023-24కు రూ.14.49 లక్షల కోట్లకు పెరిగినట్టు పేర్కొన్నారు. అంటే ఏడాదిలో రూ.1.47 లక్షల కోట్లు పెరిగింది. దేశ జీడీపీ వృద్ధి 8.9 శాతం నమోదు కాగా.. తెలంగాణ వృద్ధిరేటు ఏకంగా 11.3 శాతంగా నిలిచింది. జాతీయ సగటు కన్నా 2.4 శాతం ఎక్కువని స్వయంగా ఆర్థిక మంత్రి తెలిపారు. తలసరి ఆదాయంలోనూ ఇదే జోరు కనిపించింది. 2022-23లో రూ.3.09 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం నిరుడు రూ.3.43 లక్షలకు పెరిగినట్టు చెప్పారు. ఏడాది కాలంలో రూ.33,385 పెరిగింది. ఇది 10.7 శాతం వృద్ధి. దీంతోపాటు తయారీ రంగం, రియల్ ఎస్టేట్, నిర్మాణం, మైనింగ్, క్వారీ వంటి రంగాల్లో అధిక వృద్ధిరేటు సాధించినట్టు వెల్లడించారు. ఇదంతా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. అంతే కాకుండా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని కూడా ప్రభుత్వం పొగిడింది. రైతులకు పెట్టుబడి సాయం అందించడం ప్రశంసనీయం అని పేర్కొన్నది.

# పరిశ్రమలశాఖకు 2,543 కోట్లే

- బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులే చేసిన సర్కారు
- సబ్సిడీ బకాయిలకైనా చాలని కేటాయింపు నిధులు
- కొత్త ఇండస్ట్రియల్ పార్కుల ఊసే ఎత్తని రేవంత్ సర్కారు
- మంత్రి శ్రీధర్‌బాబు అసంతృప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్‌పై ప్రతిపక్ష నాయకులతోపాటు మంత్రులు సైతం మండిపడుతున్నారు. పారిశ్రామిక రంగం నుంచి భారీగా ఆదాయాన్ని దండుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కారు ఐటీ, పరిశ్రమల శాఖకు నామమాత్రపు కేటాయింపులతో సరిపెట్టిందని, బడ్జెట్‌లో రూ.3,317 కోట్లు మాత్రమే కేటాయించిందని స్వయంగా ఆ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబే ధ్వజమెత్తారు. ఇందులో ఐటీ రంగానికి కేటాయించిన రూ.774 కోట్లు మినహాయిస్తే పరిశ్రమల శాఖకు దక్కేది రూ.2,543 కోట్లు మాత్రమేనని పెదవి విరిచారు. ఈ నిధులు పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలకు కూడా సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నవారికి వివిధ పథకాల కింద దాదాపు రూ.3 వేల కోట్ల సబ్సిడీలు చెల్లించాల్సి ఉన్నదని వాపోయారు. దీంతో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు సబ్సిడీలు ఇచ్చేందుకు, కొత్త ఇండస్ట్రియల్ పార్క్‌ల అభివృద్ధికి నిధులు ఎక్కడి నుంచి తేవాలన్నది అంతుబట్టకుండా ఉన్నది. ఈ నేపథ్యంలో పరిశ్రమల శాఖకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ఆర్థిక శాఖ మంత్రిని కోరినట్టు చెప్పారు. వాస్తవానికి రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధి, రాయితీల కోసం బడ్జెట్‌లో కనీసం రూ.5,200 కోట్లైనా కేటాయించాలని పరిశ్రమల శాఖ ప్రతిపాదించింది. కానీ, బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులు ఇందులో సగం కూడా లేకపోవడం గమనార్హం.

### కొత్త ఇండస్ట్రియల్ పాలసీ ఊసేదీ?

రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు త్వరలో నూతన విధానాన్ని ప్రవేశపెడతామని పదేపదే చెప్పున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. తాత్కాలిక బడ్జెట్‌లో దాని ఊసే ఎత్తలేదు. దీంతో ఆ పాలసీ కోసం ఎదురు చూస్తున్నవారందరికీ నిరాశ తప్పలేదు. నూతన పారిశ్రామిక విధానంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులు, పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు జరిపి సలహాలు, సూచనలు తీసుకున్నది. దీంతో కొత్త పాలసీలో ప్రకటించే సబ్సిడీలపై అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కేంద్రం ఇస్తున్న సబ్సిడీలతోనే సరిపెడతారా? లేక రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏమైనా వాటా కలుపుతుందా? అని ఎదురుచూస్తున్నారు.

# డిక్లరేషన్లు బుట్టదాఖలు!

- ఐదు డిక్లరేషన్లకు బడ్జెట్‌లో ఎగనామం
- అమలు చేస్తాం అనే పదం తప్ప పైసా కూడా కేటాయించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎక్కడ పడితే అక్కడ డిక్లరేషన్లను ప్రకటిస్తూ అన్ని వర్గాల ఓట్లను దండుకొన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ఆ డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసినట్టు కనిపిస్తున్నది. శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిక్లరేషన్ల ఊసే లేకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. కేవలం ఒక చోట మాత్రమే అన్ని డిక్లరేషన్లను కచ్చితంగా అమలు చేస్తామని మాత్రమే పేర్కొన్నది. కానీ అ అమలు కోసం ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం గమనార్హం. ఎన్నికల సమయంలో ఆయా వర్గాల ప్రజలను ఆకట్టుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం వరంగల్ డిక్లరేషన్, యువకుల కోసం హైదరాబాద్‌లో యువ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీల కోసం చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, బీసీల కోసం కామారెడ్డిలో బీసీ, మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఆ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఈ డిక్లరేషన్లను ఆర్భాటంగా ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే వీటిలోని ప్రతి అంశాన్ని అమలు చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ తీరా అధికారంలోకి వచ్చాక మాత్రం ఆ డిక్లరేషన్లను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ హామీలు అమలు చేయాలంటే నిధులు అవసరం. నిధులు కావాలంటే బడ్జెట్‌లో కేటాయించాలి. కానీ కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో డిక్లరేషన్ల అమలుకు అవసరమైన నిధులను కేటాయించలేదు. అయినప్పటికీ డిక్లరేషన్లను అమలు చేస్తామంటూ చెప్పడం గమనార్హం.

### రైతులు, యువకులే బాధితులు

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఐదు డిక్లరేషన్లలో రైతులకు సంబంధించి వరంగల్ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ అత్యంత కీలకమైనవి. ఈ రెండింటిలో ఆ పార్టీ 14 హామీలు ఇచ్చింది. రైతుల డిక్లరేషన్‌కు సంబంధించి రైతుభరోసా కింద రూ. 15వేలు, ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ, కూలీలకు రూ. 12 వేలు, అన్ని పంటలకు మద్దతు ధర, పంటల బీమా, ప్రతి ఎకరాకు సాగునీళ్లు, రైతు కమిషన్ ఏర్పాటు, కొత్త వ్యవసాయ విధానం, ధాన్యంతోపాటు ప్రతి పంటకు మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లింపు వంటి అంశాలున్నాయి. యూత్ డిక్లరేషన్‌కు సంబంధించి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రతి ఏడాది జూన్ 2న జాబ్ క్యాలండర్, సెప్టెంబర్ 17లోపు ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి చెల్లింపు, యూత్ కమిషన్ ఏర్పాటు, యువకులకు రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణం.. ఇలా చాలా హామీలనే ఇచ్చింది. కానీ ఈ హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# దరఖాస్తులు 82 లక్షలు.. ఇండ్లు 4లక్షలు!

- బడ్జెట్‌లో గృహ నిర్మాణానికి కేటాయింపులు రూ. 7,740 కోట్లు
- నియోజకవర్గానికి 3,500 ఇండ్ల నిర్మాణం లక్ష్యం
- కావాల్సిన నిధులు 21వేల కోట్లు
- కేంద్ర సాయం అందినా రూ.8 వేల కోట్ల లోటు
- అర్హులను తగ్గించేందుకే అనేక నిబంధనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): తమది ప్రజా ప్రభుత్వమని పదేపదే గొప్పలు చెబుతున్న రాష్ట్ర సర్కారు పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు మాత్రం అరకొర నిధులు కేటాయించింది. ప్రజాపాలన ద్వారా ఇండ్ల కోసం 82 లక్షల దరఖాస్తులు వస్తే వాటిలో నాలుగు లక్షల ఇండ్లను మాత్రమే ఈ ఏడాది నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. శనివారం ప్రవేశపెట్టిన 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో 4 లక్షలకుపైగా ఇండ్ల నిర్మాణానికి రూ.7,740 కోట్లు కేటాయించింది. దీనికి కేంద్ర సాయం కలుపుకొన్నా నిర్ధారిత లక్ష్యం చేరుకోవాలంటే మాత్రం మరో రూ.8 వేల కోట్లు అవసరం.

### నియోజకవర్గానికి 3,500 ఇండ్లు

నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 119 నియోజకవర్గాల్లో 4,16,500 ఇండ్లను నిర్మించనున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఒక్కో ఇంటికి రూ. ఐదు లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది. ఈ లెక్కన 4.16 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ. 20,825కోట్లు అవసరమవుతాయి. బడ్జెట్‌లో గృహనిర్మాణానికి కేటాయించింది కేవలం రూ. 7,740కోట్లు. అంటే, రూ. 13వేల కోట్ల పైచిలుకు లోటు ఉన్నట్టే. ఈ లోటును ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం నుంచి రాబడతామని చెప్పినప్పటికీ ఈడబ్ల్యూఎస్ పథకం కింద కేంద్రం ఒక్కో యూనిట్‌కు గరిష్ఠంగా రూ.1.5 లక్షలు మాత్రమే సాయం అందిస్తున్నది. ఈ లెక్కన చూసుకున్నా 4.16 లక్షల ఇండ్లకు రూ. 6.2 కోట్ల మాత్రమే వచ్చే అవకాశముంది. అంటే ఇంకా రూ.7-8 వేల కోట్ల వరకు లోటు ఉన్నట్టే.

### అర్హులను తగ్గించే ప్లాన్

ఆరు గ్యారెంటీల హామీకి మొత్తం 1,25,84,383 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 82,82,332 దరఖాస్తు లొచ్చాయి. వీటిలో పాపువంతుమంది అర్హులను గుర్తించినా దాదాపు 20 లక్షల మందికి ఇండ్లు నిర్మించాల్సి ఉంటుంది. బడ్జెట్‌లో మాత్రం నాలుగు లక్షల ఇండ్లు మాత్రమే నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ లెక్కన 20 లక్షల మందికి ఇండ్లు నిర్మించాలంటే ఐదేండ్లు పడుతుంది. అంత కంటేముందు అర్హులు ఎంతమంది అన్నది తేలాల్సి ఉంటుంది. అర్హులను వీలైనంతగా తగ్గించేందుకు రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ, ఆస్తులు, నెల సంపాదన, కారు, బైక్ వంటివాటితో లింకుపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

### గృహనిర్మాణ లక్ష్యం.. నిధుల వివరాలు

- ఈ ఏడాది ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్ల లక్ష్యం
- ఒక్కో ఇంటికి అందించే ప్రభుత్వ సాయం- రూ. 5 లక్షలు
- 119 నియోజకవర్గాల్లో నిర్మించాల్సిన ఇండ్లు- 4,16,500
- 4,16,500 ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులు - రూ. 20,825కోట్లు
- 2024-25బడ్జెట్‌లో గృహ నిర్మాణానికి కేటాయింపులు- రూ. 7,740కోట్లు
- కేంద్ర సాయం ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షలు
- 4,16,500 ఇండ్లకు వచ్చే సాయం రూ. 6,247.5కోట్లు
- కేంద్ర సాయం పోగా 4.16 ఇండ్ల నిర్మాణానికి నిధుల లోటు రూ. 7 వేల కోట్లు

# వ్యవసాయానికి కోత 7 వేల కోట్లు

- బడ్జెట్‌లో రైతన్నకు మొండిచేయి
- వ్యవసాయానికి రూ.19,746 కోట్లు
- రుణమాఫీ, రైతుబంధుకు కేటాయింపులు గుండుసున్నా
- కూలీలు, కౌలురైతుల ఊసులేదు

వ్యవసాయశాఖకు కేటాయించిన బడ్జెట్ రూ. **19,746**

గత బడ్జెట్ కేటాయింపులు రూ. **26831** కోట్లు

వ్యవసాయ బడ్జెట్‌లో కోత రూ. **7085** కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): తమది రైతు పక్షపాత ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ బడ్జెట్‌లో రైతులను పక్కనపెట్టింది. తొలి బడ్జెట్‌లోనే రైతులపై తమకున్న ప్రేమ ఏపాటిదో చెప్పకనే చెప్పింది. శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 19,746 కోట్లు మాత్రమే కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది రూ.7,085 కోట్లు తక్కువ కావడం గమనార్హం. 2023-24 బడ్జెట్‌లో కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.24,254 కోట్లు కేటాయించి రైతుల పక్షపాతి అనిపించుకుంది. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ పథకాలకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటి ఊసే ఎత్తలేదు. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. రూ. 2 లక్షల రుణమాఫీకి మాత్రం చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించింది. ఆ పథకాన్ని సమీక్షించి పెంచిన మొత్తాన్ని ఇస్తామని వివరించింది. రైతు కూలీలు, కౌలురైతు పథకాల ఊసెత్తలేదు.

### అనుబంధ రంగాలకు నిధుల్లేవు

వ్యవసాయశాఖకు రూ. 19,746 కోట్ల బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం అనుబంధ రంగాలైన పశుసంవర్ధక, మత్స్యశాఖలను మరిచిపోయింది. వీటికి నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 5,188 కోట్లు కేటాయించింది. అంతేకాదు, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆయిల్‌పామ్ సాగుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. గత ప్రభుత్వం మాత్రం ప్రతి బడ్జెట్‌లోనూ రూ. 1000 కోట్లు కేటాయించేది.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రులు వేముల, గంగుల, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా, వివేకానంద, పాడి

# ప్రతిపక్ష నేతకు పెద్ద గది కేటాయించండి

- స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత కే చంద్రశేఖర్‌రావుకు సరైన గదిని కేటాయించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు బీఆర్ఎస్ ఎల్పీ విజ్ఞప్తిచేసింది. శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సీహెచ్ మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొన్నేండ్లుగా ప్రతిపక్ష నేతకు కేటాయిస్తున్న గదిని కేటాయించకుండా చిన్న గదిని కేటాయించారని పేర్కొన్నారు. 39 మంది సభ్యులున్న బీఆర్ఎస్‌కు ప్రస్తుతం కేటాయించిన చిన్న గది ఏ మాత్రం సరిపోదని, దాని కంటే రెండింతల గదిని ప్రధాన ప్రతిపక్ష నేతకు, మరో గదిని బీఆర్ఎస్ఎల్పీకి స్పీకర్ చాంబర్ సమీపంలో కేటాయించాలని కోరారు.

# గ్యారెంటీ లేని బడ్జెట్

మొదటిపేజీ తరువాయి...

కేటాయించి చేతులు దులుపుకొన్నది. అంటే డిమాండ్‌లో 31 శాతం మాత్రమే ప్రతిపాదించింది. ఒకవేళ అన్ని అంశాలు కాకుండా దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వం భావించినా.. ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా అమలు చేయాల్సిన హామీలకే సుమారు రూ.82 వేల కోట్లు అవసరమని నిపుణులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుండగా, రూ.500కే సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను బడ్జెట్‌లో ప్రకటించింది. రైతులకు రూ.15 వేల పెట్టుబడి సాయం, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు, పంట బోనస్, ఆసరా పెన్షన్లు 4 వేలకు పెంపు వంటివి తప్పనిసరిగా ఈ ఏడాదే అమలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వీటి అమలుకు సుమారు రూ.82 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా. అంటే దాదాపు రూ.30వేల కోట్ల మేర కేటాయింపులను తగ్గించింది.

### 'గృహజ్యోతి' పథకంలో మెలిక

'రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందజేసేందుకు మంత్రివర్గంలో నిర్ణయించాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తునిస్తాం' అని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి వచ్చేసరికి మాత్రం అర్హులైన కుటుంబాలకు మాత్రమేనంటూ మెలికపెట్టింది. మ్యానిఫెస్టోలో ఒకలా ప్రకటించిన ఓట్లు దండుకొని.. తీరా బడ్జెట్‌కు వచ్చేసరికి అర్హులైన లబ్ధిదారులకు వర్తింపజేస్తామంటూ ప్రజలను మోసపుచ్చింది. రాష్ట్రంలో 90 లక్షల గృహాలుండగా.. ఏటా గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలంటే రూ.8 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వ వర్గాలు తేల్చాయి. కానీ తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం ఇందుకోసం రూ. 2,400 కోట్లను మాత్రమే కేటాయించింది. అంటే 30శాతం నిధులను మాత్రమే బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఈ లెక్కన గృహజ్యోతి అమలుపై ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆటో డ్రైవర్లకు మొండి'చెయ్యి'

మహాలక్ష్మి పథకం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం బడ్జెట్‌లో వారి ప్రస్తావనే తీసుకురాలేదు. దీంతో ఆటో డ్రైవర్లలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆటో డ్రైవర్లకు ఏటా రూ. 12వేల చొప్పున సహాయం అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఆ మేరకు బడ్జెట్‌లో నిధుల కేటాయించలేదు. ఆటో డ్రైవర్ల సాయంపై అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తే.. వారికి తప్పకుండా సాయం చేసే బాధ్యత తమదేనని చెప్పిన కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో మాత్రం వారికి మొండి'చెయ్యి' చూపింది.

# గ్రామస్థాయిలో రెవెన్యూ సహాయకుల ఏర్పాటుపై కమిటీ

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు అందించడానికి ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దుతో సామాన్య ప్రజలకు రెవెన్యూ సేవలు అందలేదని, పేదలు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. గ్రామంలో రెవెన్యూ వ్యవస్థకు గ్రామ రెవెన్యూ సహాయకులను నియమించాలని యోచిస్తున్నామని, ఇందుకు ఒక కమిటీని శనివారం నియమించామని తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్), రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సభ్యులుగా ఉంటారని, సీసీఎల్ఏ కార్యదర్శి సభ్య కార్యదర్శిగా కొనసాగుతారని చెప్పారు. ఈ కమిటీ వీలైనంత త్వరగా తమ నివేదికను అందిస్తుందని వెల్లడించారు.

# కృష్ణా జలాలను ఐక్యంగా కాపాడుకుందాం

- సీనియర్ జర్నలిస్టులు పాశం, గాదె పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కేఆర్ఎంబీ ద్వారా తెలంగాణకు భవిష్యత్తులో జరగబోయే అతి భయంకరమైన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని కాపాడుకోవడానికి వెంటనే ప్రజాప్రతినిధులు ఐక్యంగా ప్రయత్నాలు ప్రారంభించాలని సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, గాదె ఇన్నారెడ్డి కోరారు. విభజన చట్టాన్ని అడ్డుపెట్టుకొని దేశంలో ఏ నది మీద ఏర్పాటు చేయనన్ని ఆంక్షలతో కృష్ణా నదిని పూర్తిగా తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలనే కేంద్రం కుట్రను తిప్పికొట్టాలని కోరారు. అనవసరమైన రాజకీయ గందరగోళాన్ని పక్కనపెట్టి కృష్ణా పరివాహక ప్రాంతం పూర్తిగా ఎడారి కాకుండా జాగ్రత్త పడాలన్నారు. కేంద్రం కుట్రను వ్యతిరేకిస్తూ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని విజ్ఞప్తిచేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలవాలని కోరారు.

# 2 లక్షల ఉద్యోగాలేవి.. భృతి హామీ ఏమైంది?

- నిరుద్యోగుల ఆశలను నీరుగార్చిన బడ్జెట్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రెండు లక్షల ఉద్యోగాల భర్తీ విషయమే లేదు.. నిరుద్యోగ యువతకు నెలనెలా నిరుద్యోగ భృతి ప్రస్తావనే రాలేదు.. బీఆర్ఎస్ సర్కారుకు ఉన్న చిత్తశుద్ధిలో కొంతైనా కాంగ్రెస్‌కు లేదని నిరుద్యోగులు కాంగ్రెస్ సర్కారుపై భగ్గుమంటున్నారు. పైరెండు అంశాలను బడ్జెట్‌లో చేరుస్తారని భావించిన నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశనే మిగిల్చింది. శనివారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో ఎప్పటిలాగే తన నైజాన్ని బయటపెట్టుకుందని పలువురు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిని ప్రధాన అజెండాగా చేసుకుని ముందుకెళ్లిన ఆ పార్టీ.. తర్వాత ఆచరణలో మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. బీఆర్ఎస్ సర్కారు గత బడ్జెట్ సమయంలో భవిష్యత్తులో భర్తీ చేయబోయే ఉద్యోగులకు ప్రతినెలా వేతనాల బడ్జెట్‌నూ ప్రవేశపెట్టి తన చిత్తశుద్ధిని చాటుకున్నది. ఉద్యోగాల భర్తీ చేసిన తర్వాత కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారి సంఖ్య, వారికి ప్రతినెలా ఇవ్వబోయే వేతనాలను అంచనా వేసి వెయ్యి కోట్లను నాటి బడ్జెట్‌లో ప్రతిపాదించింది. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎంతో ముందుచూపుతో ఉంటుందని అందరూ ఆలోచించారు. అదంతా ఒట్టిదేనని తేలింది. దీంతో నిరుద్యోగుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన వ్యక్తమవుతున్నది.

# బీఆర్ఎస్ సర్కారు పథకాల రద్దుల పద్దు

- దేశవ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపుతెచ్చిన స్కీంలపైనా కాంగ్రెస్ సర్కారు శీతకన్ను
- బడ్జెట్లో వాటి ఊసుకూడా ఎత్తని వైనం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడుతున్నది. శనివారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాల ఊసే ఎత్తలేదు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పథకాలు రాష్ట్రానికి దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చాయి. అనేక అవార్డులను సాధించిపెట్టాయి. అలాంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఆ పథకాల పేర్లను సైతం బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. వాటికి కనీసస్థాయిలో కూడా కేటాయింపులు చేయలేదు. పల్లె ప్రగతి ద్వారా ప్రతి గ్రామం శుభ్రంగా, పరిశుభ్రంగా మారింది. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్, డంపింగ్ షెడ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం ఇలా అనేక కార్యక్రమాలను చేపట్టారు. పట్టణ ప్రగతి లోనూ పచ్చదనం, పారిశుద్ధ్యం, వాహనాలు, ఎఫ్ఎస్‌టీపీ, వైకుంఠధామాలు, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను నిర్మించారు. మున్సిపాలిటీలు సైతం అనేక అవార్డులు దక్కించుకొన్నాయి. ఇంతటి ఖ్యాతికి కారణమైన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలకు కాంగ్రెస్ సర్కారు నిధులు కేటాయించకపోవడం గమనార్హం.

### దళితబంధు అంతేసంగతి!

దళితజాతి సముద్ధరణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం తన ఎన్నికల మ్యానిఫెస్టోలో అంబ